వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ లలితానగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సత్యనారాయణ స్వామి ఆశీసులతో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. లక్ష్మీనారాయణ హోమం, లక్ష పుష్పార్చన నిర్వహించామని ఆలయ చైర్మన్ పూర నరసింహ గుప్తా తెలిపారు. మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, బచ్చు సత్యనారాయణ, వైస్ చైర్మన్ పాల్తి శ్రీనివాస్, సలహాదారు దేవర లింగారెడ్డి, మాజీ చైర్మన్‌లు చిదర నాగేందర్, కుమారస్వామి, వక్కలంక శ్రీనివాస్, ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం: ఏబీవీపీ



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

వనస్థలిపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అన్నారు. బంద్ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. బంద్‌కు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్కారి మహేష్, జిల్లా కన్వీనర్ హనుమాన్ చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్యాణ్, ఎస్ఎఫ్ఎస్ జిల్లా కన్వీనర్ మధు, గంగాధర్, శ్రీరామ్, వెంకటేష్, విశ్వతేజ, రోహన్ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో విస్తృత తనిఖీలు

సైదాబాద్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం సైదాబాద్ ఠాణా పరిధిలోవిస్తృతంగా తనిఖీలు చేపడతామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఇటీవల పాతబస్తీలో తరచూ నేరాలు చోటు చేసుకోవడం, డ్రగ్స్, గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే వార్తల నేపథ్యంలో మంగళవారం రాత్రి సైదాబాద్ పీఎస్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతమైన సింగరేణి కాలనీ సహా పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాత్రి వేళల్లో సంచరిస్తున్న వారిని ఆపి సోదాలు చేశారు. గుర్తింపు పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సోదాలు కొనసాగుతాయని, గుంపులుగా తిరిగే వారితో పాటు, నిర్ణీత సమయం తర్వాత కూడా షాపులు తెరిచి ఉంచిన వారిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



సింగరేణి కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సిబ్బందే ఆర్‌టీసీకి మూలస్తంభాలు



ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది, విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఎం శ్రీలత

చైతన్యపురి: ఆర్‌టీసీ సంస్థకు కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు మూల స్తంభాలు వంటి వారని రీజనల్ మేనేజర్ శ్రీలత అన్నారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి అవార్డులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎం.. ఉత్తమ కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లకు శాలువా కప్పి ప్రశంసా పత్రం, రివార్డు అందజేశారు. అలాగే, ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన చిన్నారులను అభినందించి నగదు బహుమతులు అందజేశారు. డిపో మేనేజర్ కృష్ణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ఉషశ్రీ, రవిశంకర్, ఉమాపతి పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం: సంరెడ్డి



ఎమర్జెన్సీలో అరెస్టైన నాయకులను సన్మానించిన బీజేపీ నేతలు

సైదాబాద్: భారత దేశ చరిత్రలో ఎమర్జెన్సీ విధింపు ఒక చీకటి అధ్యాయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా సైదాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయించారన్నారు. పత్రికలకు సెన్సార్ విధించి ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతు నొక్కారని విమర్శించారు. ప్రస్తుతం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తోందని అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు పాలైన పలువురు నాయకులను ఈ సందర్భంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ పాల్గొన్నారు.

గ్యాంగ్‌లు కట్టి గొడవలు

- అల్లరిమూకలకు కేరాఫ్‌గా ఎల్బీనగర్ ప్రాంతం
- గంజాయి మత్తులో యువకులు దాడులు
- పోలీస్ నిఘా మరింత పెంచాలంటున్న స్థానికులు



అర్ధరాత్రి రోడ్డుపై తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎల్బీనగర్ పోలీసులు

నాగోలు: ఎల్‌బీనగర్ ప్రాంతం అల్లరి మూకలకు, గ్యాంగ్ వార్‌లకు కేరాఫ్‌గా మారుతోంది. అత్యధిక కాలనీలు, బస్తీలు.. జనాభాతో కిక్కిరిసి ఉండే ఈ ప్రాంతంలో అదే స్థాయిలో నేరాలు సైతం జరుగుతున్నాయి. ఇక్కడ అత్యధికంగా పేదలు నివసిస్తుంటారు. తల్లిదండ్రులు వివిధ పనులపై నిమగ్నమై ఉండటంతో పిల్లలపై దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో యువకులు పెడదోవ పడుతున్నారు. మత్తు పదార్థాలను వినియోగిస్తూ మానసిక పట్టు కోల్పోయి నేరాల బాట పడుతున్నారు. దీంతో స్థానికంగా నేరాల సంఖ్య పెరుగుతోంది.

- ఎల్‌బీనగర్ డీసీపీ జోన్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిత్యం యువకులు చిన్నపాటి విషయాన్నే భూతద్దంలో చూస్తూ గొడవలకు దిగుతున్నారు. యువకులు జట్లు కడుతూ పరస్పరం గ్యాంగ్ వార్‌లకు దిగుతున్నారు.
- ఎల్‌బీనగర్ పరిధిలోని భరత్‌నగర్, రాజీవ్ గాంధీనగర్, ఎన్టీఆర్‌నగర్, జైపురికాలనీ, బండ్లగూడ, సాహెబ్‌నగర్, నందనవనం, భూపేష్‌గుప్తానగర్, మన్సూరాబాద్, సరూర్‌నగర్, కొత్తపేట, హకీమాబాద్, గుట్టి జంగయ్యకాలనీ, పాత ఎల్‌బీనగర్, మసీద్ గల్లీ, చింతలకంట హయత్‌నగర్ పరిధిలోని ఆర్‌కేనగర్,తట్టి అన్నారంలో యువకులు గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకొని ఒక్కో గ్యాంగ్‌కు ఒక్కో పేరు పెట్టుకుంటున్నారు.
- ఈ గ్యాంగ్‌ల మధ్య ఆధిపత్య పోరు హత్యకు కూడా దారి తీస్తోంది.
- యువకులు నిత్యం గంజాయి తాగుతూ గొడవ పడుతున్నారు. గంజాయి మత్తులు స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.
- బస్తీలో అర్ధరాత్రి వరకు బెల్ట్ దుకాణాలు నడుస్తుండటం, అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా బార్లు తెరిచి ఉండటంతో మద్యం మత్తులో యువకులు రోడ్డుపైకి వచ్చి వీరంగం సృష్టిస్తున్నారు. గంజాయి మత్తులో ఉన్న యువకులు హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని, పోలీస్ నిఘా వైఫల్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఖాళీ స్థలాలే అడ్డాలు

ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని ఖాళీ స్థలాలు, పాడుబడ్డ పాఠశాల భవనాలు, సీసీ కెమెరాలు లేని ప్రాంతాలు, చెరువు కట్టపైతో పాటు నాగోలు మూసీ ప్రాంతంలో గంజాయి ముఠాలు నిత్యం సంచరిస్తున్నాయి.



సరూర్‌నగర్‌లో ఇంటి యజమానిపై దాడి చేస్తున్న యువకులు (ఫైల్)

మచ్చుకు కొన్ని ఉదంతాలు..

- సరూర్‌నగర్ ఠాణా పరిధిలోని నేతాజీనగర్‌లో ఇంటి ముందు అర్ధరాత్రి గంజాయి తాగుతున్న వారిని ఇంటి యజమాని జనార్దన్ ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని కోరడంతో అతడిపై రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.
- బండ్లగూడకు చెందిన డేరింగుల మల్లికార్జున్ అలియాస్ మర్డర్ మల్లేష్(28)ను పాత గొడవల నేపథ్యంలో నాగోలు లక్ష్మీనర్సింహ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారు.
- నాగోలు పీఎస్ సాయినగర్ సమీపంలో భరత్‌నగర్‌కు చెందిన యువకుడు గౌతమ్‌పై పలువురు యువకులు కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.
- ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఈనెల 2న రెండు గ్యాంగ్‌ల మధ్య పెద్ద గొడవ జరిగింది.
- చైతన్యపురి ఠాణా పరిధిలోని స్నేహపురి కాలనీలోని ఓ బేకరీలో ఉన్న వృద్ధుడిపై మద్యం మత్తులో ఉన్న యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.
- మన్సూరాబాద్‌లో ఓ యువకుడిని పాత కక్షల నేపథ్యంలో తీవ్రంగా కొట్టారు. తర్వాత అతను చికిత్సపొందుతూ మృతి చెందాడు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎల్‌బీనగర్ ప్రాంతంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడతున్నాం. బస్తీల్లో రాత్రి వేళల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి అనుమానితులపై కేసులు నమోదు చేస్తున్నాం. బస్తీల్లో బెల్ట్ షాపులను మూసివేయించడంతో పాటు గుట్కా విక్రయించే వారిపై కేసులు నమోదు చేయిస్తున్నాం. అర్ధరాత్రి వరకూ రోడ్లపై సంచరించే యువకులపై పెట్టీ కేసులు నమోదు చేయడంతో పాటు ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఎల్‌బీనగర్ డీసీపీ

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా డబుల్ రోడ్డులోని హియర్ వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్స్ నిర్వహిస్తామని డా.గంజి శ్రీలత తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోన్ నం. 9703235513, 9985631926 లో సంప్రదించాలన్నారు.

నేడు హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కరణ

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో గురువారం నిర్వహించే హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరవుతారని ఆ శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. ఉదయం 9 గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందని అన్నారు. నగరంలోని దివ్యాంగులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం



విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

మలక్‌పేట: మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, 18 ఏళ్ల వయసు లోపు వారు వాహనాలను నడపరాదని, అది చట్టరీత్యా నేరమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. టీటీఐ బేగంపేట ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ సాకేత జూనియర్ కాలేజీలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానికి రూ.25 వేలు జరిమానా, 3 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. దీనితో పాటు వాహనం రిజిస్ట్రేషన్ సంవత్సరం పాటు రద్దు అవుతుందన్నారు. ఇలా కేసు నమోదైన వారికి ఉన్నత చదువులకు పాస్‌పోర్ట్, వీసా జారీ కాదన్నారు. యువత ముఖ్యంగా సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సాకేత విద్యాసంస్థల చైర్మన్ జూలకంటి శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐలు రాము, మహ్మద్ జానీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైనా.. ఉపయోగం లేదు!



అసంపూర్తిగా వదిలేసిన ఫంక్షన్ హాల్ మెట్లు

పెండింగ్‌లో ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు

- ఎన్నికల వేళ హడావుడిగా రిబ్బన్ కటింగ్
- లోపించిన నాణ్యతా ప్రమాణాలు
- అందుబాటులోకి తేవాలని స్థానికుల విజ్ఞప్తి

బడంగ్‌పేట్: ఎన్నికల వేళ హడావుడిగా ప్రారంభించిన ఫంక్షన్ హాల్ నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినట్లు కన్పిస్తున్నాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని దావుత్‌ఖాన్‌గూడలో ఎకరంన్నర స్థలంలో గత ప్రభుత్వం కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదుట మెయిన్‌రోడ్డు చౌరస్తా పక్కన ప్రజల సౌకర్యార్థం ప్రజాభవన్ (ఫంక్షన్‌హాల్) నిర్మించింది. అధికారికంగా ప్రారంభానికి నోచుకున్నా పనులు ఇంకా పూర్తి కాలేదు. సాధారణ ఎన్నికల కోడ్ రాబోతున్న తరుణంలో మున్సిపల్ కార్పొరేషన్ భవనంతో పాటు ప్రజా భవనాలు సైతం మంత్రి హోదాలో దాదాపు ఎనిమిది నెలల క్రితం సబితారెడ్డి ప్రారంభించారు. దీనికోసం రూ.మూడు కోట్లకు పైగా నిధులు వెచ్చించారు. పార్కింగ్‌తో పాటు వేయి మందికి సరిపోయేలా హాలు, డైనింగ్ సెంటర్‌ను, ఇతర సౌకర్యాలను అందులో ఉండేలా రూపొందించారు. ప్రణాళిక అద్భుతంగా ఉన్నా ఆచరణలో మాత్రం పేలవంగా ఉంది. ప్రారంభోత్సవానికి ముందే భవనంలో కొంత పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ భవనం ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే బేస్‌మెంట్ కుంగిపోయింది. ఎన్నికలు ముగిసి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానికులు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని ఎదురు చూస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



ఫంక్షన్ హాల్

పెళ్లిళ్లకు అప్పులు కావొద్దని..



ప్రస్తుతం పెళ్లిళ్లు చేయాలంటే తప్పనిసరిగా ఫంక్షన్ హాల్ కావాలి. రూ.లక్షలు ధారపోసి షాదీఖానాల్లో నిర్వహించి పేద, మధ్యతరగతి ప్రజలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని ఉచిత ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని చేపట్టాం. అందుబాటులోకి వస్తే బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్, వాటి పరిసరాల్లోని ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. భవనంలో పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.

– పి.సబితారెడ్డి, మహేశ్వరం, ఎమ్మెల్యే

ఎస్ఎస్ఎల్ఆర్ కమిషనర్‌కు సత్కారం



జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను సత్కరిస్తున్న టీజీఓ అసోసియేషన్ ప్రతినిధులు

సైదాబాద్: సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్ఎస్ఎల్ఆర్) కమిషనర్‌గా కొత్తగా నియమితులైన ఐఏఎస్ అధికారి జ్యోతి బుద్ధప్రకాశ్‌ను సర్వే అండ్ ల్యాండ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం రెండ్రోజుల క్రితం జరిపిన బదిలీల్లో ఆయనను ఎస్ఎస్ఎల్ఆర్ కమిషనర్‌గా నియమించగా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టీజీఓ సర్వే అండ్ ల్యాండ్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నరహరి రావు, కార్యదర్శి రాంచందర్ తదితరులు కమిషనర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీజీఓ ఉపాధ్యక్షుడు ఎం.నాగేందర్, కోశాధికారి వి.శ్రీరాం, జాయింట్ సెక్రటరీ ఎ.ఐనేష్, ఆర్.కేశవులు ఉన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



ఏఎస్ఐని సన్మానిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

మలక్‌పేట: అంకిత భావంతో పని చేసే అధికారులకు తప్పక గుర్తింపు లభిస్తుందని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ఇటీవల ఉత్తమ సేవా పథకాలు అందుకున్న మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్, ఎస్ఐ మహ్మద్ జానీ ఏఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, శివ నారాయణలను ఏసీపీ బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ /వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 43, వంకాయ 40, బెండ 45, పచ్చిమిర్చి 60, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 24, క్యారెట్ 40. దొండ 18, ఆలు 37, ఉల్లి 37, గోకర 45, దోస 23, సొర 11, పొట్ల 23, అరటి 10, చిక్కుడు 65, అర్వి 37, మునగ 105, చిలగడదుంప 55, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 65. గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నాగోలు: ఆర్‌టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు తెలుసుకొనేందుకు బండ్లగూడ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రమేష్ బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 9958224058 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి రవాణా పరమైన సమస్యలపై ఫిర్యాదులు చేయడంతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని డీఎం పేర్కొన్నారు.

నీటి కొరత నివారించినందుకు సత్కారం



ఉపేందర్‌రెడ్డి, రాఘవులను సత్కరిస్తున్న కాలనీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ పార్కులో నీటి కొరత నివారణకు కృషి చేసిన వారికి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పార్కులో తన సొంత నిధులతో బోర్ వేయించిన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, మోటార్‌ను అందించిన గ్రీన్ హిల్స్ కాలనీ నివాసి రాఘవులు గుప్తాలకు బుధవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పుష్పలతా రెడ్డి, ముప్పిడి లింగస్వామి గౌడ్, రాఘవరెడ్డి, రేగట్టె నరసింహా రెడ్డి, వెంకటేశ్వరరావు, దయాకర్ రెడ్డి, రఘువీర్, సంగీత శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కాశీ విశ్వేశ్వరాలయం' వార్షికోత్సవాలు

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీలోని శివ పంచయతన కాశీ విశ్వేశ్వరాలయం సప్తమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతల రాజిరెడ్డి పాల్గొన్నారు. తూర్పటి చిరంజీవి, ఉప్పల సాయి తేజ, ఉప్పల సాయి కిరణ్, జైపురి కాలనీ అధ్యకుడు యాదగిరి, రమేశ్, మాధవి, మమత, ప్రసన్న, మీనా పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి తదితరులు

మలక్‌పేట: మెట్రోపాలిటన్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి అరుణ కుమారి ఆధ్వర్యంలో బుధవారం అక్బర్ బాగ్‌లోని మలక్‌పేట హైస్కూల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ మలక్‌పేటలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు వినియోగించే వ్యక్తి శారీరకంగా, మానసికంగా కృంగి కృశించి పోతాడని, అందరికీ దూరమవడంతో పాటు భవిష్యత్ అంధకారమౌతుందన్నారు. మలక్‌పేట ఎస్ఐ నవీన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం.. నిందితుడి అరెస్ట్



నిందితుడు కట్టెల శ్రీకాంత్

నాగోలు: చిన్నారిపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్‌లోని సద్గురుకాలనీలో ఓ కుటుంబం నివాసముంటోంది. వీరికి చిన్నారి(4)ఉంది. ఇంటి కౌంపౌండ్‌లోని మరో ఇంట్లో కట్టెల శ్రీకాంత్(27) అనే యువకుడు తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. శ్రీకాంత్ జీహెచ్ఎంసీ కార్మికుడు పనిచేస్తూ ఇండ్ల నుంచి చెత్తను సేకరించే ఆటో రిక్షాలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం చిన్నారి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. శ్రీకాంత్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి చిన్నారిపై లైంగిక దాడికి యత్నించాడు. వెంటనే చిన్నారి ఏడవడంతో తల్లి బాత్‌రూమ్ వద్దకు పరుగెత్తింది. వెంటనే శ్రీకాంత్ తల్లిని తోసేసి పరారయ్యాడు.దీంతో తల్లిదండ్రులు కాలనీ వాసులు సహకారంతో బుధవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు శ్రీకాంత్ అరెస్టు చేసి అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2024–25 సంవత్సరానికిగాను దోస్త్ (ఆన్‌లైన్) ద్వారా అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించే వారికి అన్ని సదుపాయాలతో బోధన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీ డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో చదవాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు కళాశాల కోడ్ 12818తో దోస్త్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఓ ప్రకటనలో ఆమె తెలిపారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వ చ్ఛ ఆదిబట్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందు లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో పదిరోజులపా టు ప్రతిరోజు ఉదయం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మా ట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పా టించాలని కోరారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకా లు అందేలా కృషిచేస్తామన్నారు. పట్టణంలోని శ్మశా న వాటికకు నిధులు కేటాయించామని తెలిపారు. ముందుగా మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థలో ఉ న్న భవనాలను జేసీబీ సహకారంతో కూల్చివే యించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, కమిషనర్ బాలకృష్ణ, డీఈ శిల్ప, గ్రామస్తులు.. సాంబయ్య గౌడ్, రాజు, పాండురంగారెడ్డి, సాయిబాబగౌడ్, రజినీకాంత్‌గౌడ్ తదతరులు పాల్గొన్నారు.